జగన్నాథ రథోత్సవం.. జగదానంద పర్వం



ప్రత్యేక అలంకరణలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి



హౌసింగ్ బోర్డు కాలనీలోని జగన్నాథస్వామి రథయాత్రలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: మండలంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సంకీర్తనలు, కోలాటాలు, భజనలు వేదమంత్రాలు, మంగళధ్వనులతో పులకరించింది. జగన్నాథస్వామి స్వామి రథయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల జగన్నాథ స్వామి ఆలయంలో నీలాచల్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలభద్ర, సభద్రతో పాటు జగన్నాథ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను రథంపై కూర్చోబెట్టి రథయాత్రను అంగరంగా వైభవంగా నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైంది. అక్కడి నుంచి వేద మంత్రాలు, గాతా పారాయణ, మేళతాళాలు, కోలాటం నడుమ వైభోవపేతంగా కోరాడ, బాలచెరువు, నెల్లిముక్కు, అయ్యన్నపాలెం మీదుగా ఆలయం వరకూ ఈ యాత్ర ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా భక్తులు జై జగన్నాథ్ అంటూ మార్మోగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, పలువురు నాయకుల, అసోసియేషన్ సభ్యులు ప్రకాష్, ఆలయ అర్చకుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వైభవంగా రథయాత్ర

ఉక్కునగరం: కోరిన కోర్కెలు తీర్చే దేవునిగా ఖ్యాతి గాంచిన జగన్నాథుని రథయాత్ర ఉక్కునగరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదట స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుని ఉత్సవ విగ్రహాలను రథంపైకి తరలించారు. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్ సంప్రదాయ దుస్తుల్లో బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు జై జగన్నాథ్ నామస్మరణల మధ్య రథాన్ని ఊరేగించారు. ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా రథం ఇంద్రజుమ్న హాలుకు చేరుకుంది. ఈ సందర్భంగా భజనలు, కోలాటాలు, నత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో పాటు ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



ఉక్కు జగన్నాథుని రథాన్ని బంగారు చీపురుతో ఊడ్చుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్



ఉక్కునగరం రథయాత్రలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు

అగనంపూడిలో.

అగనంపూడి: జగన్నాథ రథ చక్రాలు కదిలాయి. అగనంపూడిలోని జగన్నాథస్వామి ఆలయంలో జగన్నాథస్వామి రథోత్సవం (తొలియాత్ర)తో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయం నుంచి జగన్నాథస్వామి ఆలయ పూర్వీకులు, పండితులు పండా కుటుంబీకులు సుభద్ర, బలభద్రుని సమేత జగన్నాథస్వామి వార్లను రథంపైకి తీసుకువెళ్లారు. ముందుగా జగన్నాథస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే, పల్లా శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. తరువాత రథాన్ని లాగారు. అగనంపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, వడ్లపూడి, లంకెలపాలెం, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ ఉత్సవమూర్తులను అలంకరింపజేసి విశేష పూజలు చేశారు. రథోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రామలు ప్రదర్శించారు. కార్యక్రమంలో 79, 85 వార్డుల కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, నాయకులు దుల్ల రామునాయుడు, కొయ్య వెంకట కృష్ణారెడ్డి, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, గళ్ల సాయికుమార్, గొల్లవిల్లి వెంకటరావు, కోసూరి తాతారావు, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదారాణి తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

క్లుప్తంగా

క్రికెట్ పోటీల విజేత అక్కిరెడ్డిపాలెం



అక్కిరెడ్డిపాలెం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న భార్గవ్ కుటుంబ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డుకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు కసిరెడ్డి సంజయ్ భార్గవ్ ఇటీవల హైదరాబాదులో క్రికెట్ ఆడుతూ మృతి చెందాడు. వార్డు పరిధి మిందిలో అతని జ్ఞాపకార్థం మృతుని మిత్రులు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో అక్కిరెడ్డిపాలెం, రాజీవ్ నగర్ యూత్ జట్లు తలపడ్డాయి. అక్కిరెడ్డిపాలెం విన్నర్‌గా, రాజీవ్‌నగర్ యూత్ రన్నర్‌గా నిలిచాయి. విన్నర్ జట్టుకు స్వర్గీయ కసిరెడ్డి సంజయ్ భార్గవ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా నగదు బహుమతులు, ట్రోఫీ అందజేశారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు

అగనంపూడి: పాడేరు నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు బస్సులో గంజాయి తరలిస్తున్న మహిళను దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం అల్లూరి సీతారామారాజు జిల్లా పాడేరుకు చెందిన చిలకమ్మ నాలుగు ప్లాస్టిక్ కవర్లతో 8 కిలోల గంజాయిని సబ్బవరం మీదుగా బస్సులో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో దువ్వాడ నాగదేవత కొండ వద్ద పోలీసులు మాటువేసి బస్సులో తరలిస్తున్న గంజాయి సంచులను స్వాధీనం చేసుకొని చిలకమ్మను అరెస్టు చేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్ననాయకులు

పెదగంట్యాడ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపన దినోత్సవాన్ని మండలంలోని పెదగంట్యాడ జంక్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, సంపూర్ణం, పెద్దాడ వెంకటరమణ, టీకేటి శ్రీను, డాక్టర్ ఎస్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదు క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

అగనంపూడి: గాజువాక నుంచి చింతపల్లికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక సమీపంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన తంపర బలరామ్ పెదగంట్యాడ ప్రాంతం నుంచి ఐదు క్వింటాల ప్రజా పంపిణీ బియ్యాన్ని చింతపల్లికి వ్యాన్‌లో తరలిస్తున్నారు. దువ్వాడ పోలీసులు వడ్లపూడి కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బియ్యం అక్రమ రవాణా బాగోతం బయటపడింది. పోలీసులు బలరామ్‌ను అరెస్టు చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డికి సత్కారం



మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు

పెదగంట్యాడ: గత ఐదేళ్లలో గాజువాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికే దక్కుతుందని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని ఆయన స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హౌస్ కమిటీ సమస్యతో పాటు పాత కర్ణవానిపాలెం, తుంగ్లాం ఏపీఐఐసీ రైతుల సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, కాలువలు నిర్మించిన ఘనత నాగిరెడ్డికు దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, అండిబోయిన అప్పారావు, వాసా అప్పలరెడ్డి, టీకేటి శ్రీను పాల్గొన్నారు.

మన్యం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు గౌరీ సంఘం సత్కారం



మన్యం కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

ఉక్కునగరం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆదారి శ్యాంప్రసాద్‌ను శీలానగర్ గౌరీ సేవా సంఘం సభ్యులు సత్కరించారు. ఆదివారం ఆయన స్టీల్‌ప్లాంట్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన విషయం తెలిసి సంఘం సభ్యులు ఆయనకు శాలువా కప్పి, మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మన్యం జిల్లా కలెక్టర్‌గా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన నేతృత్వంలో మన్యం జిల్లా మరింత అభివృద్ధి చెందగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు ఆళ్ల రాంప్రసాద్, అధ్యక్షులు పెంటకోట ఉమామహేశ్వరరావు, మద్దాల శ్రీనివాసరావు, ఆళ్ల నగేష్‌కుమార్, దొడ్డి సూరిబాబు, శరగడం రామచంద్రరావు, దాడి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గణితంలో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి



సరోజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డీఈవో చంద్రకళ, ఆర్జేడీ విజయ్ భాస్కర్

పెదగంట్యాడ: గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా తయారు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో గోపాలపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత పోటీలలో మండలంలోని యారాడ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సరోజ్ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను డీఈవో చంద్రకళ, ఆర్జేడీ విజయ్ భాస్కర్ సత్కరించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ చతుర్విధ ప్రక్రియలు విద్యార్థులకు సులభమ్యే విధంగా బోధన సాగించాలన్నారు. పోటీ పరీక్షల్లో సైతం గణిత ప్రశ్నలకు చకచకా సమాధానాలు రాసేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులను మరింతగా ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం



విశ్రాంత ఉక్కు ఉద్యోగులు, వాకర్స్‌క్లబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న వాకర్స్‌క్లబ్

అగనంపూడి: అగనంపూడి వాకర్స్‌క్లబ్‌లో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములుగా ఉంటూ విశాఖ ఉక్కు ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన వేంకటేశ్వరరావు, చేబ్రోలు శంకరరావు, వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసిన చిన్ని పూర్ణలను వాకర్స్‌క్లబ్ ఘనంగా సత్కరించింది. ఆదివారం వాకింగ్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరసింగరావు, బి.రామారావు మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే అనేక మంది దాతల సహకారంతో కనీస వసతులు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. దీంతో వాకర్స్ గతం కంటే రెట్టింపు అయ్యాయరన్నారు. కార్యక్రమంలో కరణం పైడిరాజు, గొల్లవిల్లి కనక భవానీ, జ్యోతి, వెంకటరావు, కేవీ నాయుడు, ఇందిరా, బి.సత్యనారాయణ, నరసింగరావు, వెంకటరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక



కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణ నూతన కమిటీ చైర్మన్లగా మంత్రి శంకరనారాయణ, మునగపాక అచ్చింనాయుడును ఆదివారం ఎన్నుకున్నారు. ఈ మేరకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా బత్తిన నాగభూషణంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ సుదర్శనరావు, సియ్యాద్రి అప్పలరాజు, నరవ శ్రీను, ఇందల సోమునాయుడు, గెద్దం రమణ, పీత రమణ, బత్తిన భానుకిరణ్, పీత నాగరాజు, తాటికొండ జగదీష్, పాముల ఉమా, మునగపాక బాబూరావు, ఎంకేఎస్ మూర్తి, శీర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రంజిత్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: తన భర్త కుడుముల రంజిత్ గత నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని నక్కవాని పాలెంకు చెందిన సుజాత ఆదివారం గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియలేదని తెలిపారు. రంజిత్ కూలి పనులు చేస్తుంటాడు. రంజిత్ తండ్రి రమణబాబు వీఆర్ఏగా పనిచేస్తున్నారన్నారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో గ్రే కలర్ టీ షర్ట్, బ్లూ జీన్స్, స్లిప్పర్స్ వేసుకున్నాడని, ఎత్తు 5 అడుగుల 8 అంగుళాలు ఉంటాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8332948137, 9032304137 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలి



మాట్లాడుతున్న ఇంటక్ నాయకుడు భాస్కరరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేసి పూర్వ వైభవానికి సహకారం అందివ్వాలని విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘం (ఇంటక్) ప్రధాన కార్యదర్శి పి.భాస్కరరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 1242వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు...సెయిల్‌లో విలీనమే శరణ్యమన్నారు. ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వబోమన్నారు. కార్యక్రమంలో పీవీ నగేష్, వంశీకృష్ణ, సుబ్బయ్య, జి.నాగిరెడ్డి, బైరెడ్డి, కె.రమణ, రామారావు తదితరులు మాట్లాడారు.

వ్యర్థాల తొలగింపు



చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న వాకర్స్

అగనంపూడి: పరిశుభ్రత మానసిక ప్రశాంతతను, ఆరోగ్యాన్ని కల్గిస్తుందని అగనంపూడి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడుగల నరసింగరావు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అగనంపూడి వాకర్స్‌క్లబ్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, సీసాలను తొలగించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ కార్యదర్శి బి.రామారావు, కోశాధికారి కరణం పైడిరాజు, రామన్, కృష్ణారావు, చంద్రశేఖర్, బత్తుల కాళిదాస్, బలిరెడ్డి సత్యనారాయణ, అప్పలనాయుడు గొల్లవిల్లి కనక భవానీ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాలతో అలరించారు. గణపతి స్తుతి గీతానికి చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా కళాకారులు దీక్షిత ,స్నిగ్ధ ప్రమిదలో వెలిగించిన దీపాలు చేతబూని ఘటాలపై ప్రదర్శించిన నృత్యాభినయాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి. కళకారులు మోక్షిత, సత్యవర్షిణి, రిషిత, జోషిత, శృతి, శ్రీజ, సహస్ర, అంజని, సమన్వి, కుందన ప్రియ, విద్య, ప్రణతి, లాస్య, శ్రావణి, దీక్షిత, చాందిని తదితరులు చేసిన నృత్యాలకు శ్యామల దర్శకత్వం వహించారు.

సింథటిక్ వాలీబాల్ కోర్టు ప్రారంభం



కోర్టును ప్రారంభిస్తున్న రియర్ అడ్మిరల్ మురళీ

సింథియా: నౌకాదళ సిబ్బందిలో క్రీడా స్ఫూర్తి నింపేలా వైజాగ్‌లోని బేస్ విక్చువలింగ్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన సింథటిక్ వాలీబాల్ కోర్టును ఆదివారం రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు ప్రారంభించారు. అనంతరం వాలీబాల్ మ్యాచ్‌ను తిలకించి క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

ఏయూ మెస్‌ల ఆకస్మిక తనిఖీ



మెస్‌లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల మెస్‌లను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల, రీసెర్చ్ స్కాలర్స్, మహారాణిపేటలోని విద్యార్థినుల మెస్‌లను పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల రుచి, నాణ్యత వంటివి ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెస్‌లలో సిబ్బంది ప్రవర్తన, పనితీరు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మెస్‌లలో పలు మార్పులు చేయాలని కోరారు. వాటికి త్వరలో పరిష్కారం చూపుతామని రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు. తరచూ మెస్‌లను తనిఖీ చేస్తామని, నాణ్యతలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. మెస్‌లలో పని చేస్తున్న సిబ్బందితో నేరుగా మాట్లాడారు. రుచిగా, శుచిగా భోజనం అందించడానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్‌లు బి.మునిస్వామి, కె.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హరనాథుని జయంతి



ఏకాహం చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : రాజీవ్‌నగర్ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీచే ఆదివారం హరనాథుని జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో గల కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుసుమకుమారిదేవికి కుంకుమార్చనలు జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. షోడశాక్షరి నామంతో 24 గంటలు ఏకాహం చేపట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, కోశాధికారి ఎస్. అన్నాజీరావు, ఆశ్రమ ప్రతినిధులు శివ, సీతారాం, నాని, కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

సీతంపేట: సమాజంలో బ్రాహ్మణుల మనుగడకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని వివిధ వర్గాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు పిలుపునిచ్చారు. వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యువ రాజకీయ వేత్త ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ సమాజంలో అందరూ బాగుండాలని కోరుకునే వారిలో మొదటి వారు బ్రాహ్మణులేనని, అలాంటి వారు నేడు దుర్భర స్థితిలో ఉన్నారన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా, వ్యాపార రంగాల్లో బ్రాహ్మణుల ఎదుగుదలకు అవరోధం కలిగించే శక్తులు ఎన్నో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. న్యాయవాది కె.వి.నరసింహమూర్తి మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ భవన్‌కు కొంత స్థలాన్ని కేటాయించగా.. దానికి కంచె వేశామన్నారు. బ్రాహ్మణ సంఘాల పేరిట ఇవ్వాల్సిన ఆ స్థలాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్, దేవదాయ శాఖ సంయుక్త పేరిట ఇవ్వడంతో దానికి క్లియరెన్స్‌లో జాప్యం జరిగిందని చెప్పారు. ఏపీ బ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ సీవీఎస్ సాయిరామ్, వైద్యులు విజయశేఖర్, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కాపూరి చరణ్, సంస్థ గౌరవాధ్యక్షులు టీఏస్నార్ ప్రసాద్, వివిధ సంఘాల ప్రతినిధులు నెమ్మలూరి శివగణేష్, దివాకర్, హనుమంతరావు, మహంతి, డాక్టర్ వాణి తదితరులు భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.